క్లుప్తంగా

నాట్లు షురూ



దుగ్గొండి : రోహిణి కార్తె నడుస్తోన్న ప్రస్తుత రుణంలోనే నైరుతి ఆగమనంతో ముందస్తు వర్షాలు ప్రారంభం కావడంతో పల్లెల్లో సోమవారం నాట్లు మొదలయ్యాయి. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి నేల పదనెక్కింది. దీంతో మండలంలోని నాచినపల్లి, పొనకల్, తొగర్రాయి, గిర్నిబావి, మందపల్లి, చాపల బండ, అడవి రంగాపురం, పీజీతండా, రాజ్యతండా, తదితర గ్రామాల్లో దుక్కులు సిద్ధం చేసిన రైతులు సోమవారం విత్తనాలు నాటే పనులు చేపట్టారు. పత్తి విత్తనాలు నాటుతుండడంతో పొలాలలో సందడి నెలకొంది.

పరామర్శ



రాయపర్తి : మండలంలోని తిర్మలాయపల్లికి చెందిన జినుగు విజేందర్‌రెడ్డి ఇటీవల మృతి చెందగా అతడి కుటుంబ సభ్యులైన ప్రదీప్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, వేమన్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మన్మోహన్‌రెడ్డిలను అతడి బంధువైన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. అనంతరం ఇల్లంద వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ముద్రబోయిన వెంకటేశ్వర్లు చేతికి దెబ్బతగలగా అతన్ని నరేందర్‌రెడ్డి పరామర్శించారు.

చెన్నారావుపేటలో..



చెన్నారావుపేట : మండల కేంద్రానికి చెందిన మట్ట చిన్న వీరారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా అతడి కూతురైన బీఆర్‌ఎస్ కౌన్సిలర్‌ను, బాధిత కుటుంబాన్ని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. తొలుత వీరారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు రఫీ, నాయకులు బండి సారంగపాణి, మధుసూదన్‌రెడ్డి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడికి..

గీసుకొండ : మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు రాజును అతడి తల్లి సుజాత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన క్రమంలో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సోమవారం పరామర్శించారు. ఆర్థికసాయం అందజేశారు. అలాగే ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వంచనగిరి సొసైటీ చైర్మన్ కొల్లూరి రవీందర్‌ను మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరుపై అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

నివాళి

ఖానాపురం : మండల కేంద్రానికి చెందిన కొలిశెట్టి హరిప్రసాద్ (37) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం రాత్రి మృతి చెందగా ఆయన మృతదేహానికి గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ వేములపల్లి సుబ్బారావు మంగళవారం నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని సుబ్బారావు పరామర్శించారు.

పిల్లల విద్యాభ్యాసానికి చేయూత

హరిప్రసాద్ పిల్లలిద్దరికీ పదో తరగతి వరకు ఉచితంగా విద్యాబోధన అందిస్తామని గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ వేములపల్లి సుబ్బారావు హామీ ఇచ్చారు. హరిప్రసాద్ తన స్కూల్‌లోనే విద్యార్థిగా చదువుకున్నాడని గుర్తు చేసుకున్నారు. చిన్న వయస్సులోనే మృతి చెందడం బాధాకరమన్నారు. హరిప్రసాద్ కూతురు వైష్ణవి 6వ, కుమారుడు వర్షిత్ 3వ తరగతి గీతాంజలి స్కూల్‌లోనే చదువుతుండగా ఇక నుంచి వారికి ఉచితంగా పదో తరగతి వరకు విద్యాబోధన అందిస్తామని చెప్పారు.

'కల్తీ విత్తనాల విక్రయం'

నర్సంపేట : పట్టణంలోని కొన్ని ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నారని డీబీఆర్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇమ్మడి బాబు తెలిపారు. పట్టణంలోని పలు ఫర్టిలైజర్ షాపులను ఆయన ఆధ్వర్యంలోని బృందం సోమవారం సందర్శించి పరిశీలించింది. అనంతరం బాబు మీడియాతో మాట్లాడారు. కొందరు ఫర్టిలైజర్ షాపుల యజమానులు గతేడాదికి సంబంధించిన విత్తనాలను ప్రస్తుతం రైతులకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. రైతుల అవసరాలను ఆసరా చేసుకుని కొందరు డీలర్లు అక్రమాలకు పాల్పడుతున్నారని చెప్పారు.

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

దామెర : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ముగింపు వేడుకలు సోమవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు గుండు రాము పార్టీ జెండాను ఆవిష్కరించారు. ప్రధాన కార్యదర్శి ముదిగొండ కృష్ణమూర్తి, వైస్‌ఎంపీపీ జాకీర్ అలీ, నాయకులు శ్రీధర్‌రెడ్డి, రమేశ్, కిశోర్, రాకేశ్, కుమార్, వీరస్వామి పాల్గొన్నారు.

చెన్నారావుపేట : కొట్టుకుపోయిన ధాన్యం



ఖానాపురం : తడిసిన ధాన్యం బస్తాలు



నెక్కొండ : మార్కెట్‌లో కారుపై పడిన చెట్టు



గాలివాన బీభత్సం.. అపార నష్టం

చెన్నారావుపేట : ఆదివారం రాత్రి చోటు చేసుకున్న గాలివాన బీభత్సానికి రైతులకు అపార నష్టం వాటిల్లింది. వర్షంతో ఎండ వేడి నుంచి జనానికి కొంత ఉపశమనం లభించినా రైతులకు మాత్రం నష్టం మిగిల్చిందని చెప్పక తప్పదు. మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం తడిసి దెబ్బతిన్నది. గొల్లపల్లి శివారులోని వ్యవసాయ భూముల్లోని 11 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు నష్టం వాటిల్లింది. , బాపునగర్, సూర్యపేట తండాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఆ శాఖ అధికారులు యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టారు. చెన్నారావుపేటకు చెందిన కోరె రాకేశ్ ఏర్పాటు చేసుకున్న రెండు ఎకరాల బొప్పాయి తోటలోని చెట్లు నేలవాలాయి. కాయలు రాలి సుమారుగా రూ.30 వేల నష్టం వాటిల్లింది. పలువురు రైతులూ నష్టపోయారు.

పిడుగు పడి గడ్డివాము దగ్ధం

పిడుగు పడి గడ్డివాము దగ్ధమైన ఘటన మండలంలోని జల్లి గ్రామ శివారులోని బోడ తండాలో చోటు చేసుకుంది. తండాకు చెందిన బోడ హీరాలాల్ పశువుల మేత కోసం మూడెకరాల గడ్డివామును తన వ్యవసాయ భూమిలో నిల్వ చేయగా పిడుగు పడి మంటలు వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. తండావాసులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడంతో ఫైర్ ఇంజన్ రాగా సిబ్బంది మంటలు ఆర్పివేశారు. సుమారు రూ.30 వేల విలువైన పశుగ్రాసం విలువ దగ్ధమైందని బాధిత రైతు హీర్‌లాల్ వాపోయాడు.

నెక్కొండ : స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారస్తులకు సంబంధించిన కారు, బొలెరో వాహనాలపై చెట్టు విరిగి పడింది. దీంతో కారు ఇంజన్ ధ్వంసమైంది. రైల్వేస్టేషన్ సమీపంలోని మసీదు ఎదుట ఉన్న రావి చెట్టు నేలకూలింది. కూలిన చెట్లను గ్రామ పంచాయతీ, మార్కెట్ సిబ్బంది తొలగించారు. చెట్టు పడిన వాహనాల్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. సోమవారం ఉదయం తిరిగి సరఫరాను పునరుద్ధరించారు.

ఖానాపురం : మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఆరబెట్టుకున్న ధాన్యాన్ని తడవకుండా



చెన్నారావుపేట : నేలవాలిన బొప్పాయి చెట్లు



చెన్నారావుపేట : దగ్ధమైన గడ్డివాము



చెన్నారావుపేట : గొల్లపల్లిలో విరిగిపడిన 11 కేవీ ట్రాన్స్‌ఫార్మర్

కాపాడుకోవడానికి నానా తంటాలు పడ్డారు. బస్తాల్లో నింపి మిల్లులకు తరలించాల్సిన ధాన్యం సైతం తడిసిపోవడంతో రైతులు భోరున విలపించారు. మండలంలోని అశోక్‌నగర్‌లో బస్తాల్లో నింపిన ధాన్యం తడిసిపోవడంతో రైతులు కన్నీరు మున్నీరయ్యారు. తడిసిన ధాన్యం బస్తాలను ఆరబెట్టుకోవడానికి అష్టకష్టాలు పడడం కనిపించింది. అడపాదడపా తడిసిన ధాన్యాన్ని మిల్లర్లు దించుకునేలా అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

పిడుగుపాటుకు గేదె మృతి

పర్వతగిరి : పిడుగుపాటుతో చూడి గొడి గేదె మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన రైతు నర్సెట్టి రాజుకు చెందిన గేదె ప్రతీరోజులాగే మేతకు వెళ్లిన క్రమంలో ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షం కురుస్తుండగా పిడుగుపడటంతో మృతి చెందింది. గేదె మృతితో తనకు సుమారు రూ.70 వేల నష్టం వాటిల్లిందని రాజు వాపోయాడు. గేదె కళేబరాన్ని పశు వైద్యాధికారి పరిశీలించారు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు రాజు కోరాడు.

విద్యుదాఘాతానికి గురై ఎద్దు..

విద్యుదాఘాతానికి గురై ఎద్దు మృతి చెందిన ఘటన మండలంలోని దేవీలాల్‌తండాలో సోమవారం చోటు చేసుకుంది. తండాకు చెందిన రైతు ధరావత్ వెంకన్నకు చెందిన ఎద్దు మేత మేస్తుండగా పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ వైర్లు తగలి విద్యుద్ఘాతానికి గురై అక్కడిక్కడే మృతి చెందింది. మృతి చెందిన ఎద్దు విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని రైతు తెలిపారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు కోరాడు.



నెక్కొండ : రైల్వేస్టేషన్ సమీపంలో కూలిన చెట్టు



పర్వతగిరి : మృతి చెందిన గేదె



పర్వతగిరి :మృతి చెందిన ఎద్దు

ఎల్గూర్‌రంగంపేట తూముకు మరమ్మతు

సాక్షి ఎఫెక్ట్..

సంగెం : మండలంలోని ఎల్గూర్ రంగంపేట జాలు తూముకు అధికారులు ఎట్టకేలకు మరమ్మతులు చేపట్టారు. 'చెరువులకు మరమ్మతు చేసేదెన్నడో' శీర్షికతో చెరువుల తూములు, కట్టల మరమ్మతు ఆవశ్యకతపై మే 31న ప్రచురితమైన 'సాక్షి' ప్రత్యేక కథనానికి ఐబీ అధికారులు సోమవారం స్పందించారు. జాలు తూము మరమ్మతు పనులను ప్రారంభించారు. తొలుత తూములోకి చెరువు నీరు చేరకుండా అడ్డుగా మట్టి బస్తాలు వేయించి తూములో పూడుకుపోయిన మట్టిని తొలగించే పనులు చేపట్టారు. అనంతరం తూము షట్టర్‌కు మరమ్మతు చేసి తూము నుంచి నీటి లీకేజీ తలెత్తకుండా చూస్తామని ఐబీ ఏఈ హమీద్ తెలిపారు. మిగితా చెరువుల మరమ్మతులు కూడా త్వరగా చేపట్టాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. వానాకాలం మొదలవుతున్న తరుణంలో తూము మరమ్మతు చేసేలా అధికారులను అప్రమత్తం చేసేలా ప్రత్యేక కథనం ప్రచురించిన 'సాక్షి'కి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.



తూముకు మరమ్మతు చేస్తున్న కూలీలు

ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం

- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.నాగయ్య

నర్సంపేట : ఐక్యఉద్యమాలతోనే వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కారమౌతాయని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.నాగయ్య స్పష్టం చేశారు. పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు నమిండ్ల స్వామి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి నాగయ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలోని వ్యవసాయ కార్మికులు అనేక ఎదుర్కొంటుండగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. వ్యవసాయ కార్మికులకు గతంలో కనీస వేతన చట్టం ఉండేదని గుర్తు చేశారు. పదేళ్లుగా కనీస వేతన చట్టాన్ని పట్టించుకున్న దాఖలాల్లేవని మండిపడ్డారు. ఉపాధి హామీ పనుల్లో దినసరి కూలీ రూ.300 ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినా అమలులో నిర్లక్ష్యం కొనసాగుతోందని చెప్పారు. పని ప్రదేశాల్లో తాగునీటి, ఇతర వసతుల కల్పనను ప్రభుత్వం గాలికొదిలేసిందని ధ్వజమెత్తారు. కూలీల కనీస వేతన చట్టాన్ని సవరించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసపూరితంగా వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలోని ప్రభుత్వాలు పేదలకు రేషన్ షాపుల ద్వారా 14 రకాల నిత్యావసర సరుకులు అందించగా గడచిన పదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాపులను పూర్తిగా విస్మరించిందని చెప్పారు. వ్యవసాయ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, గుడిసెవాసులకు పట్టాలిచ్చి ఇళ్లు కట్టించాలని, పోడు భూములకు సంబంధించి అర్హులకు పట్టాలివ్వాలని, కౌలు రైతులకు రైతుబంధుతోపాటు రైతుబీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తప్పుడు విధానాలకు వ్యతిరేకంగా ఐక్యపోరాటాలే శరణ్యమని స్పష్టం చేశారు. శ్రేణులు కార్మికులను, ప్రజలను చైతన్యవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు. రాబోయే రోజుల్లో పెద్దఎత్తున పోరాటాలు తప్పవని తెలిపారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి భూక్య సమ్మయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు బోళ్ల సాంబయ్య, నాయకులు మూగ నోజు శారద, ఇస్లావత్ రవి, బస్కె మొగిలి, రుద్రారపు లక్ష్మి, గంగాధరి వెంకటమ్మ, మహేశ్వరి, సదయ్య, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జి.నాగయ్య

పుస్తకాల విక్రయాలను అడ్డుకుంటాం



సమావేశంలో మాట్లాడుతున్న బి.పూర్ణ

నర్సంపేట : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా డివిజన్ పరిధిలోని పలు ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో పాఠ్యపుస్తకాల విక్రయాలు చేపడితే సంఘం ఆధ్వర్యంలో అడ్డుకుంటామని ఏఐఎస్‌బీ డివిజన్ కన్వీనర్ బి.పూర్ణ స్పష్టం చేశారు. పట్టణంలోని సిద్దార్థ కళాశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నర్సంపేట డివిజన్‌లోని పలు ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్ల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల ఆవరణలో పాఠ్యపుస్తకాలు, డ్రెస్సులు, షూ, సాక్స్, టై, బెల్టులు, తదితరాలు అధిక ధరలకు విక్రయిస్తూ తల్లిదండ్రుల నుంచి మోసపూరితంగా డబ్బు దండుకుంటూ సొమ్ము చేసుకుంటున్నాయని ఆరోపించారు. ఇకనైనా ప్రభుత్వం, విద్యాశాఖ జిల్లాస్థాయి అధికారులు స్పందించి స్కూళ్లలో యూనిఫారాలు, ఇతరత్రా పేరుతో వ్యాపారాలు నిర్వహించడాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటాలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు శ్రీధర్, రాజు, సాయి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక వికాసం



క్రీడాకారులకు మెమోంటోలు అందజేస్తున్న సీఐ పవన్‌కుమార్ తదితరులు

గీసుకొండ : క్రీడలతో విద్యార్థుల్లో శారీరక, మానసిక వికాసం కలుగుతుందని సీఐ ఎల్.పవన్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలో నెల రోజుల పాటు నిర్వహించిన వేసవి ఖోఖో శిక్షణ శిబిరం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరై క్రీడాకారులకు మెమోంటోలు అందజేసి అభినందించారు. అనంతరం సీఐ మాట్లాడారు. విద్యార్థి దశలోనే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. చదువులకే పరిమితం కాకుండా ఆటపాటల్లోనూ రాణిస్తే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోగలరని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై వెంకన్న, ఉపాధ్యాయుడు కర్ణకంటి రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

'మాస్టర్ మైండ్స్'తో నిబంధనల ఉల్లంఘన

నర్సంపేట : పట్టణంలోని మాంటిస్సోరి స్కూల్ యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ మాస్టర్ మైండ్స్ స్కూల్ పేరుతో మండలవ్యాప్తంగా ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేస్తూ మోసపూరిత ప్రచారం చేస్తోందని ఏబీఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అల్వాల నరేశ్, డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు గడ్డమీది బాలకృష్ణ, ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతం సిద్దు తెలిపారు. పట్టణంలో మాస్టర్ మైండ్స్ పేరుతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ఎదుట విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. పాఠశాల యాజమాన్య తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. అనంతరం బొట్ల నరేశ్, అల్వాల నరేశ్, బాలకృష్ణ, సిద్దు మాట్లాడారు. మాంటిస్సోరి స్కూల్ పేరుతో పాఠశాల నిర్వహించాల్సి ఉండగా అందుకు భిన్నంగా మాస్టర్ మైండ్స్ స్కూల్ పేరుతో గ్రామాల్లో ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి భారీగా వసూలు చేస్తున్నారని చెప్పారు. సదరు స్కూల్ యాజమాన్య తప్పుడు విధానాలపై సంబంధిత విద్యాశాఖ అధికారికి వారం రోజుల క్రితం ఫిర్యాదు చేసినా స్పందించలేదని ధ్వజమెత్తారు. ఇకనైనా ప్రభుత్వం, విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సరుకుల పంపిణీ

రాయపర్తి : మండలంలోని సూర్యతండాకు చెందిన రామావత్ పంతులు గుండెపోటుతో మృతి చెందగా తండాకు చెందిన ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు సురేందర్ నాయక్ సమాచారం అందించగా బాధిత కుటుంబానికి ఎస్‌ఆర్‌ఆర్ ఇన్‌ఫ్రా సంస్థల అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి నిత్యావసర సరుకులు పంపించగా గ్రామస్తులు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు గబ్బెట బాబు, నాయకులు సుధాకర్, యాకూబ్, వాగ్యా, భాస్కర్, క్రాంతి, పద్మ, లలిత, రవి పాల్గొన్నారు.



సరుకులు అందజేస్తున్న గ్రామస్తులు

ప్రభుత్వ స్కూళ్లకు పుస్తకాలొచ్చాయ్

ఖానాపురం : ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలొచ్చాయి. విద్యార్థులకు ఏటా పాఠ్యపుస్తకాలు అందించడం ఆనవాయితీగా వస్తుండగా గతేడాది నుంచి నోట్‌బుక్కులు సైతం అందజేస్తున్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో, కేజీబీవీ, మోడల్ స్కూళ్లల్లో చదువుతున్న విద్యార్థులకు అందజేయడానికి అవసరమైన మేరకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు చేరుకున్నాయి.


మండలవ్యాప్తంగా మోడల్, కేజీబీవీతోపాటు 8 హైస్కూళ్లు, 27 ప్రాథమిక, ఒక ప్రాథమికోన్నత పాఠశాలలున్నాయి. వీటి పరిధిలో గత విద్యాసంవత్సరం 2710 మంది విద్యార్థులు చదువుకున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. ప్రస్తుత విద్యాసంవత్సరంలోనూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు మొదలు పెట్టింది. ఇప్పటికే పాఠశాలల నిర్వహణను అమ్మ ఆదర్శ కమిటీలకు అప్పగించిన విషయం తెలిసిందే. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను సైతం పెంచడానికి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. పలు పాఠశాలల్లో పనులు మొదలయ్యాయి. ఇక ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు పంపిణీ చేయనున్నారు. గతేడాది బీఆర్‌ఎస్ ప్రభుత్వం విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీకి శ్రీకారం చుట్టగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి ముఖచిత్రంతో కూడిన నోట్‌బుక్స్ పంపిణీ చేయడానికి సిద్ధం చేసింది.

తల్లిదండ్రులపై భారం తగ్గించేలా..

ప్రభుత్వ పాఠశాలల్లో పేద, మధ్య తరగతికి చెందిన కుటుంబాల పిల్లలే అధికంగా చదువుకోవడం పరిపాటి. వారికి పాఠ్యపుస్తకాలతోపాటు నోట్‌బుక్స్ అందజేస్తే తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గించవచ్చని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. 1 నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు వర్క్‌బుక్స్, 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు నోట్‌బుక్స్ అందించనున్నారు. ఒక్కో విద్యార్థికి 6 చొప్పున నోట్ బుక్స్ అందిస్తారు. ప్రస్తుత విద్యాసంవత్సరం ఈనెల 12 నుంచి ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. పాఠశాలలు తెరుచుకునే రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు నోట్‌బుక్స్ అందించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలోనే మండల రిసోర్స్ సెంటర్ (ఎమ్మార్సీ)కి సుమారు 13 వేల నోట్‌బుక్స్ చేరుకున్నాయి.



ఎమ్మార్సీకి చేరిన పాఠ్యపుస్తకాలు



సీఎం చిత్రంతో ముద్రించిన నోట్‌బుక్

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



గీసుకొండ : మండలంలోని కొమ్మాలలో మాజీ వార్డు సభ్యురాలు బస్కె లక్ష్మి, విశ్వనాథపురంలో బొట్ల పెద్దారావు, ఊకల్‌లో చిన్నపెల్లి కొమురయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఆదివారం రూ.5 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ఆయన పంపించిన డబ్బును బాధిత కుటుంబాలకు ఆ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అల్లం మర్రెడ్డి, వీరగోని రాజ్‌కుమార్, కొమ్ము శ్రీకాంత్, కూసం రమేశ్, నాగారపు స్వామి, నకిరబోయిన నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వడ్లకొండలో..

పర్వతగిరి : మండలంలోని వడ్లకొండకు చెందిన బైరి సాయిమల్లు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి మాజీ సర్పంచ్ ఆమడగాని రాజుయాదవ్ వెయ్యి రూపాయల నగదు, 50 కేజీల బియ్యం సాయం చేశారు. అనంతరం బాధిత కుటుంబాన్ని రాజు పరామర్శించారు. కార్యక్రమంలో పట్టాపురం వెంకట్‌రాజు, బైరి ఎల్లయ్య, సాయిలు, జయరాములు, వెంకన్న, సత్యం, మహేశ్, శిరంశెట్టి హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గీతకార్మికుడికి గాయాలు

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లికి చెందిన గీత కార్మికుడు చిర్ర రాజు సోమవారం ఉదయం తాటిచెట్టుపై నుంచి పడి గాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ప్రభుత్వం తక్షణమే ఎక్స్‌గ్రేషియా అందించి ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరారు.